# ఆనాటి చెలిమి

**— ఎ. శ్యామలారాణి**

"నేనంత చులకనై పోయానన్న మాట! లేకపోతే, ఆ రాంబాబుగాడి బాబాయిగాడి కెన్ని గుండెలు! పిల్లకి సొట్టచెయ్యి ఉందని చెప్పకుండా, చూసి రమ్మంటాడా! అదే వాడి కొడుక్కైతే అలా చేస్తాడా? ఫూల్...." ఇలా నేను మండిపోతూంటే, చిరునవ్వుతో చూస్తూ అంది అక్కయ్య:

"ఎందుకురా అంత కోపం? ఇప్పుడా సొట్టపిల్లను చేసుకోమని నిన్నెవరు బలవంత పెట్టేరు ఏమిటి? పోనీ, ఏదో చూసేవ్ - నాకు నచ్చలేదు అని రాసిపారేయ్ - అంతేగా! దానికింత చిందులు తొక్కడ మెందుకూ?"

అక్కయ్య కెలా అర్థమవుతుంది నా బాధ? ఆ అమ్మాయికి చెయ్యంటే సొట్ట కాని - మనసుందిగా! ఎంత దీనంగా చూసిందా రోజు నాకేసి! ఇప్పుడు నా ఉత్తరం చేరితే పాపం, ఇంకెంతగా కుమిలిపోతుందో? అలాగని, జాలిపడి చూస్తూ చూస్తూ ఇన్నాళ్ళు ఉండి ఇప్పుడో సొట్టపిల్లను చేసుకోనా? ఉత్తరం రాద్దామంటే దీనంగా, అమాయకంగా ఆ అమ్మాయి ముఖం కన్పించి రాయనివ్వటం లేదు. పోనీ, ఒప్పేసుకుందునా అంటే మనసొప్పటంలేదు. ఎలా? అయినా ఏం చేస్తాం? ఉత్తరం రాసేయటమే యెలాగో లాగ అని నేను నచ్చచెప్పుకో బోతూంటే పోస్టుమాన్ వచ్చి ఓ కవరిచ్చి వెళ్లేడు.

నే చూసిన పెళ్ళికూతుళ్ల పెద్ద వాళ్లంతా ఇక్కడి అక్కయ్య అడ్రసు అడిగి పుచ్చుకున్నారుగా-ఎవరో రాసుంటారు-"ఏం చెప్తావని."

నాకెవరూ నచ్చకపోవడంచేత, విసుగ్గా కవరుచించి ఉత్తరం చదవడం మొదలెట్టేను.

కిట్టూ!

నేను, నువ్వు మొన్న ఉదయం అనుకోకుండా చూడటానికొచ్చిన సొట్ట చెయ్యి రత్నమాలవి! నువ్వు నన్ను పోల్చలేదని నాకు తెలిసింది. కాని నిన్ను నేను పోల్చాను. నీకు బాగా గుర్తు చెయ్యాలంటే దుక్కి-పాడు-రత్తి-బాదం చెట్టు జ్ఞాపకమొస్తూందా?"

అవునవును - దుక్కిపాడు. రత్తి. నే నెప్పుడో మరచిపోయిన కథ నాకు మళ్ళీ జ్ఞాపకానికొస్తూంది.

అప్పుడు నాకు పదకొండు పన్నెండేళ్ళకంటే ఉండవు. నాన్నగారిని ఏదో మన్యప్రాంతంలో ఫారెస్ట్‌రేంజి ఆఫీసరుగా వేశారు.

ఆ సంవత్సరమే అక్కయ్యకు పెళ్లి చేసారు. నా ఆరోగ్యం దృష్ట్యా నన్ను తీసుకెళ్ళటం మంచిది కాదని నన్ను, దుక్కిపాడులో ఉన్న మా పిన్నిదగ్గర ఉంచేసి, అమ్మ, నాన్నగారు వెళ్లిపోయారు నేను రణపెంకెగా ఉండేవాడిని చిన్నప్పుడు. మా పిన్ని మాత్రమే నన్ను లొంగదియ్యగలదని వాళ్ళంతాఅంటూండేవారు. అంచేత నాకిష్టంలేకపోయినా ఆ పల్లెటూళ్ళో ఉండకతప్పలేదు

నేను పెంకివాడిననే ముద్రపడిపోవటంచేత నేనే పనిచేసినా అల్లరిగా జమకట్టి అదమాయిస్తుండేది నన్నావిడ. దానితో నాకు మరింత తిక్కరేగి, ఏదో అల్లరి నిజంగానే చేసేవాడిని.

ఆ పల్లెటూళ్లో మా పిన్నిగారింటి పక్కన ఓ తల్లి, కూతురు ఉండేవారు. ఆ పిల్ల పేరు పూర్తిగా ఏమిటో నాకప్పుడు తెలియదుకానీ, రత్తి అని పిలిచేవారంతా.

"అదెంత బుద్ధిమంతురాలో చూడు! దాన్లా ఉండాలి" అంటుండేది అస్తమానం పిన్ని. అంచేత ఆ పిల్లంటే నాకు మొదట్లో అట్టే గిట్టేదికాదు. అయినా పిన్నికి పిల్లలు లేకపోవడంచేత, ఆ పిల్లతో నాకు స్నేహంచెయ్యక తప్పలేదు.

మొదటిరోజు, నేనక్కడికి వెళ్ళిన నాటి సాయంకాలం మువ్వల పట్టీలు గల్లుగల్లు మ్రోగిపించుకుంటూ, దగ్గరగా వచ్చి "ఏయ్, నీ పేరు కిసణమూరితా"! అని అడిగింది నాకా ఉచ్చారణ కర్ణకఠోరంగావినిపించి, వళ్ళుమండి. "కాదు-కిట్టూ" అన్నాను కొంచెం కోపంగానే. నన్నలాగే పిలవటం ప్రారంభించిందా పిల్ల. క్రమంగా రత్తిమీద కొంచెం సదభిప్రాయం ఏర్పడింది. ఎందుకంటే నేను అల్లరి పనులుచేసి 'ఎవరితో చెప్పకూడదు సుమా!' అంటే చస్తే చెప్పేది కాదు.

ఒకసారి మా పిన్నిగారి పెరట్లో ఉన్న పిడకలు కుచ్చెరికి నిప్పంటించాన్నేను. ఓ గంట సేపటికి అదంతా రాజుకుని పెద్దమంట లేచింది అప్పుడే ఇంట్లోంచి వచ్చిన రత్తిచూసి హడలిపోతూ, గోలాల్లో నీళ్లు చెంబుతో విసిరి, ఆర్పడానికి ప్రయత్నించింది. నేను ఏమీ ఎరగనట్టుగా వెళ్ళి పడుకున్నాను. పెరట్లో చప్పుడుకి, పొగవాసనకి పిన్ని లేచి పరుగెత్తింది.

రత్తి వాళ్ళమ్మని బయటకు పిలిచి నానా చీవాట్లు పెట్టింది. "మావాడ్నిచూసి నువ్వూ పెంకె పనులు వేర్చుకుంటున్నా

వన్న మాట! జాగ్రత్త-ఈ మారిలా చేసావంటే-" అని రత్తిని మందలించింది పిన్ని. ఆ రోజు రత్తి వాళ్ళమ్మ చేతిలో దెబ్బలు తింది. నేను మాత్రం బయటపడలేదు.

మరో రోజు మధ్యాహ్నం నేనో సాహసం చెయ్యదలిచాను. మరేం కాదు- పెరట్లో ఉన్న బాదంచెట్టు ఎక్కాలనుండేది. నాకు "వెధవా చెయ్యో కాలో విరిగితే మీ అమ్మకి ముఖం చూపించలేను నేను. చెట్టెక్కావంటేమాత్రంచూస్కో వాతలేస్తాను!" అంది పిన్ని.

చెట్టెక్కాలన్న సరదా అయితేఉంది కాని, పడతానేమో నన్న భయం కూడా ఉందినాకు. రత్తిని మంచి చేసుకుని సాయం తీసుకొచ్చాను ముందసలునన్ను చెట్టే ఎక్కొద్దంది. నేను వినలేదు.

"నువ్వు పడిపోతే? అని బిక్క ముఖం పెట్టింది.

"నీ ముఖం! నిన్నెందుకు పిలిచాననుకున్నావు; నేనుపడుతున్నానంటే నువ్వు కాస్త పట్టుకోవాలి!" అన్నాను.

"అమ్మో, నీ కంటే చిన్నదాన్ని కదా, నేనెలా పట్టుకుంటాను?" అంది భయంగా.

"అదేమో. నా కదంతా తెలియదు. నేను చెట్టెక్కి తీరాలంతే" అంటూ మొండిగా నేను ఎక్కేసాను. చొక్కా చిరిగినా ఖాతరు చెయ్యలేదు. మానుదాటి కొమ్మల మధ్యకి చేరాను. కొన్నికాయలు తెంపి క్రింద వేసాను. నా సంతోషం పట్టశక్యం కాకుండా ఉంది. ఇంతలోనే నెత్తి మీద చుర్రుమంది. తేలుకరిచినట్లు ఆ వరసన ఒళ్ళంతా ఒకటే కుట్టడం. ఎర్ర చీమలు. బాధ భరించలేక కెవ్వున కేకేసాను. చెయ్యి పట్టు తప్పింది భయపడి నంతా జరిగింది. పడ్డాను.

క్రిందనున్న బండరాతికి, నాగుండెకి మధ్య రత్తి చిన్నారి చేతులు నలిగే ఉండాలి అయినా నాకు నుదుటికి దెబ్బ తగలనే తగిలింది. రక్తం వచ్చింది. రత్తీ నేనూ ఏడుపు ప్రారంభించాం. ఇళ్ళల్లో వాళ్ళు, ఇరుగూ పొరుగూ అంతా పరుగెత్తు కొచ్చారు. చెట్టెక్కుతున్నప్పుడే నా చొక్కా కొర్రుపడింది. అంచేత వాళ్ళందరికి ఏం జరిగిందో సులువుగా అర్థమై పోయుంటుంది.

మా పిన్ని లబో దిబో మని ఏడుస్తూ నన్నెత్తుకుంది. జనం అంతా గుమిగూడేరు, నాకేవో శైత్యోపచారాలు చేసేరు. రత్తీవాళ్ళమ్మ రత్తిని నాలుగు తన్ని, లోపలకిడ్చుకు పోయింది.

మా పిన్ని నా నుదుటికి కట్టుకట్టి "పోన్లే నాయనా నన్నీమాత్రంగా బతికించావు, నీ కాలో చెయ్యో విరిగుంటే నేనీ పాటికి చచ్చూరుకుందును!" అని కన్నీళ్ళు పెట్టుకుంది.

ఆరోజురాత్రినేనునిద్రపోతున్నాననుకుని పిన్ని బాబాయి మాట్లాడుకుంటున్నారు. "ఈ పాటి వెధవనిక వాళ్ళమ్మ నాన్న దగరికిపంపించెయ్, నామాటవినిలేకపోతే, లేనిపోని అప్రతిష్టకూడాను!" అన్నాడు బాబాయ్, పిన్ని మౌనంగా ఊరుకుంది.

ఆ మర్నాడు ఉదయమంతా రత్తి కనబడలేదు. రత్తి గురించి అడగడానికి

నేను భయపడ్డాను. ఆ సాయంకాలమే తెలిసింది, రత్తికి చెయ్యి విరిగిందని! వాళ్ళమ్మ ఏడుపు నా చెవుల పడుతూనే ఉంది. మధ్యమధ్య ఆవిడ నన్ను తిడుతూంది, (అతిట్లన్నీ నాకిప్పుడు జ్ఞాపకం లేవు), ఆ మర్నాడెండకో మాపిన్ని, ఆవిడ పోట్లాడుకున్నారు. మా పిన్ని నన్ను వెనకేసుకొచ్చి మాట్లాడింది "మీ రత్తి మాత్రమేం తక్కువదేమిటి? మా వాడినదే చెట్టెక్కించుంటుంది, చెయ్యివిరిగిందని ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు ?" అంది,

రత్తికికూడా ఏవోగబ్బాకు, పుచ్చాకు వైద్యాలు ప్రారంభించారు. రెండు రోజుల తర్వాత, వాళ్ళమ్మ లేనిసమయం చూసుకుని, నేను రత్తిని చూడడానికి వెళ్ళేను. రత్తి పడుకునుంది. నన్నుచూసి ఏడుస్తూ "కిట్టూ, నేనసొట్టదాన్నయి పోతానట తెలుసా ?" అంది.

"నీకేం పరవాలేదు రత్తీ! నీచెయ్యి కేమైనా అయితే నా చెయ్యిచ్చేస్తాను ?" అన్నాను దృఢంగా. అప్పట్లో అలా అనాలనిపించింది నాకు. ఎలా ఇచ్చేయడమో నాకు తెలియదు. ఈ లోగా వాళ్ళమ్మొచ్చింది. "ఓరి పాపిష్టివాడా! ఒక చెయ్యి పుచ్చుకున్నావు చాలదట్రా ? రెండో చెయ్యి విరగ్గొట్టాల నొచ్చావా ? ఫో వెధవా, ఫో ?" అంటూ పిచ్చిగా అరిచింది. నేనుపరుగెత్తి పారిపోయాను.

పదిహేను రోజుల తర్వాత నాన్నగారొచ్చి నన్ను తీసుకుపోయారు, నేను జట్కాబండెక్కి పోతున్నప్పుడు, రత్తి చేతికట్టుతో, నన్నుచూడాటని కాబోలు వాళ్ళగదపలో కొచ్చింది, వాళ్ళమ్మ అరుస్తూవచ్చి ఆ పిల్లని వెనక్కి తీసుకుపోయింది.

తర్వాతేం జరిగిందో నాకు తెలియదు. క్రమంగా నే నా సంఘటన మరచిపోయాను.

తిరిగి ఉత్తరం చదవటం ప్రారంభించాను.

"ఎన్నాళ్ళకీ నా చెయ్యి బాగుపడకపోవడంతో మా అమ్మ నన్ను ఈ ఊళ్లో ఉన్న మా మేనమామ దగ్గరకు తీసుకొచ్చింది. వచ్చిన వారానికి ఆవిడకేదో విషజ్వరం తగిలి, నాలుగురోజుల్లో చనిపోయింది. ఆ దుఃఖంలో మునిగిపోయిన అందరికీ నా చెయ్యి సంగతి పట్టించుకునే తీరికేలేదు. క్రమంగా నా చెయ్యి మొద్దు బలిసిపోయింది.

మా మేనమామ పెళ్ళానికి నేనక్కడ ఉండటం నచ్చేదికాదు. ఈయనేమో భార్యా విధేయుడు. అతనికి, నాకు వైద్యం చేయించాలనుండేదే అనుకుంటాను. "తిండే పెట్టలేకపోతున్నాం. వైద్యాలెవడు చేయిస్తాడు ?" అనేదావిడ. నా చెయ్యి ఊసు మళ్ళీ ఎత్తితే నన్నింట్లోంచే పంపించేయమంటుందేమో ఆవిడ అని మా మామయ్య భయపడి వుంటాడు క్రమంగా సొట్టచెయ్యి మిగిలిపోయింది

మా మామయ్య కూతురికి నాకంటే చిన్నప్పుడే పెళ్ళయిపోయింది. సొట్టదాన్ని కావటంచేత నాకు కాలేదు. ఈ మధ్య గడునుదన మనుకని ఓ తెలివి తక్కువ పనిచేస్తున్నాడు మా మామయ్య

నాకు ఈ అవిటితనం వున్నసంగతి చెప్పకుండా పెళ్ళివారిని తీసుకొస్తున్నాడు-వాళ్ళు అన్నీ నచ్చాయి కాని సొట్టచెయ్యి లేకపోతే బావుండునని వెళ్ళిపోతుంటారు.

కిట్టూ ఈ మాట నే నిప్పటి కెన్నిసార్లు విని ఏడ్వవలసి వచ్చిందో చెప్పలేను. ఆ ఏడుస్తున్నప్పుడు నువ్వు జ్ఞాపకం వచ్చేవాడివి. "నీ చెయ్యి కేమైనా అయితే, నా చెయ్యిచ్చేస్తా।రత్తీ" అని నువ్వుచిన్నప్పుడన్న మాట జ్ఞాపకం వచ్చి అదేదో ఓదార్పుగా ఉండేది కాని, నువ్వే ఇలా నన్ను చూడడానికి వస్తావని నే నెప్పుడూ అనుకోలేదు.

నిన్ను, నీ నుదుటి మీదిమచ్చను చూడగానే నా కొక్కసారి దుక్కిపాడు సంఘటనంతా కళ్ళకు కట్టింది। నువ్వు కిట్టూవనుకుంటే నమ్మలేక, మానలేక, మామయ్యను నీ వివరాలన్నీ అడిగాను. అప్పుడు తెలిసింది – నువ్వు కృష్ణమూర్తివేనని కాని, నువ్వు నన్ను పూర్తిగా మరచిపోయావు.

నీకు ఇవన్నీ జ్ఞాపకం చెయ్యడం ఒక విధంగా తప్పేనేమో, కాని ఒకందుకు రాయకుండా ఉండలేకపోతున్నాను. దొంగతనంగా మామయ్య దగ్గరున్న నీ అడ్రసు తీసుకుని చనువుగా రాస్తున్నాను.

ఇదివరకు అందరూ సొట్టచెయ్యి కారణంగా చెప్పి నిరాకరించేవారు. నువ్వు నీ కిష్టం లేని విషయం బహుశః రాసావు. కాని, సొట్టచెయ్యి కారణంగా నచ్చలేదని మాత్రం రాయకు కిట్టూ। నేనది భరించలేను. 'చెయ్యిచ్చేస్తాన'న్న కిట్టునే అలా అన్నాడంటే నేను నిజంగా భరించలేను కిట్టూ। నీకు నచ్చనందుకు మరో కారణం చెప్పు. మన చిన్ననాటి స్నేహానికి గుర్తుగా నాకీ ఒక్క ఉపకారం చేస్తావని నమ్ముతున్నాను.

ఇట్లు,
రత్తి.

నా కళ్ళు చెమ్మగిల్లాయి. అది రత్తి అవిటితనం మీద కేవలం జాలివలన మాత్రంకాదు. నేను బాదం చెట్టుమీద నుంచి పడ్డప్పుడు బండరాతికీ, నా గుండెకీ మధ్య నలిగిన రెండు చిన్నారి చేతుల విచిత్ర స్పర్శ నా కొక్కసారి తిరిగి అనుభూతమైనట్లనిపించింది. అప్రయత్నంగా నా మనసులో ఓ నిర్ణయం జరిగిపోయింది. నేవిన్నాళ్ళు పెళ్ళిచేసుకోకుండా ఉన్నది రత్తి కోసమే ననుకుంటూంటే నా మనసు కేదో సంతృప్తిగా అనిపించింది — చిన్నప్పుడిస్తానన్న చెయ్యి ఈ విధంగా ఇవ్వగలుగుతున్నందుకు నాకు మహానందంగా ఉంది.

★